స్కెచ్

# "వెర్రి వెధవ"

కొడవటిగంటి కుటుంబరావు

ఈ మధ్య నే నెరగని ఒక కుర్రాడు ఒకనాడు నన్ను వెతుక్కుంటూ వచ్చాడు. కూర్చోబెట్టి, ఏమిటి విశేష మన్నాను.

"మరేం లేదు. పత్రిక ఒకటి పెడదామనుంది. మీ రేంసలహా ఇస్తారో అని" అన్నాడు కుర్రాడు.

"డబ్బుంటే పెట్టవచ్చు" అన్నాను.

"పెట్టటం విషయం సలహా అక్కర్లేదు. పెట్టటానికే నిశ్చయించాను. ఎటువంటి పత్రిక పెడితే బాగుంటుందంటారు?"

"ఎవరికి బాగుండేది?"

కుర్రాడు కొంచెం పస్తాయించి, "అందరికీ బాగుండాలి చూడండి," అన్నాడు.

"అందరికీ బాగుండే పత్రికంటూ లేదు. పత్రిక అమ్మకపోతే నీకు బాగుండదు, బాగా అమ్మితే మిగిలిన పత్రికలవాళ్ళకి బాగుండదు. వాళ్ళు నీకు శాపనార్థాలు పెడతారు. పత్రిక రాసేవాళ్ళకు బాగుంటే చదివేవాళ్ళకు బాగుండదు, చదివేవాళ్ళకి బాగుంటే రాసేవాళ్ళకి బాగుండదు" అన్నాను.

నా మాటలు కుర్రాడికి కొంచెమైనా రుచించినట్టు లేదు.

"నా ఉద్దేశ మేమిటంటే, పత్రిక చూడటానికి ఇంపుగా ఉండాలి. చదవటానికి సొంపుగా ఉండాలి. ప్రచారం నింపుగా ఉండాలి. అది ప్రపంచాన్ని ఉద్ధరించేదిగానూ, మనకు లాభించేదిగానూకూడా ఉండాలి" అన్నా డతను.

"ఇవన్నీ కలిసిరావని చెప్పానుగానూ?" అన్నాను.

"అదే నాకర్థం కావటం లేదు."

"మొదటి సంగతి, ఉద్ధరించబడాలని - నీ పత్రికద్వారా ఉద్ధరించబడాలని ప్రపంచానికి ఏమాత్రమూ లేదు. డబ్బు పోయి శనిపట్టె నని, వాళ్ళు డబ్బిచ్చి కొనుక్కునే పత్రికనిండా వాళ్ళకు కావలసిన విజ్ఞానమూ, ప్రబోధమూ, నీతులూ ఉంటే ప్రజల కెట్లా ఉంటుంది?"

"బాగుండదా!"

"ఒక్కనాటికి బాగుండదు. వాళ్ల డబ్బుకు తగ్గ ఆనందం వాళ్ళకు కలగాలి. పత్రిక ఆకర్షవంతంగా ఉండటమేకాక ఆనందదాయకంగా కూడా ఉండాలి."

"ఆ మా టన్నారు గనక చెప్పండి-ఎటువంటి రచనలు వేస్తే బాగుంటుంది మన పత్రికలో?"

"చెప్పానుగాదూ, ప్రజల కానందం చేకూర్చే రచనలు."

"ఏమి టవి?"

"వాళ్ళ అభిమానానికి పాత్రులైన వారి త్రివర్ణ చిత్రాలూ, సినిమా దృశ్యాలూ మొదలైనవి."

"అవి వేస్తా మనుకోండి. రచనల మాట?"

"ఏం రచనలు?" అన్నాను, అతని భావం తెలియక.

"వ్యాసాలు—కథలు—నాటికలు—"

"అవా? అవి ప్రజలకు ఎక్కువ రుచించవు."

"అవి లేకపోతే పత్రిక ఎట్లా నడపడం?"

"కొంతవరకు కష్టమే మరి."

నా అజ్ఞానానికి కాబోలు కుర్రాడు నవ్వుతూ, "ప్రజలకు వ్యాసా లెందుకు రుచించవంటారు?" అన్నాడు.

"వ్యాసాల్లో భాష ఉంటుంది కనక."

"ఏం, భాష ఉంటే?"

"భాషఉంటే అది అర్థం కావద్దూ? ప్రస్తుతం పత్రికలు కొనేవారికి తెలుగులో ఏమి రాయటానికి ప్రయత్నించినా అర్థం కాదు. నా భాష చాలా కటువుగా ఉంటున్నదనీ, నా రచనలు ఎవరికీ అర్థంకావటం లేదనీ చాలా ఫిర్యాదులు వచ్చాయి. నేను దాదాపు రెండు వందల మాటలు వాడతాను. అదీకాక నా రచనల్లో ఏవో ఉద్దేశా లుంటాయనికూడా ఫిర్యాదులు వచ్చాయి." కుర్రాడు ఒక్కక్షణం ఆలోచించాడు. ఆఖరుకు, "కొన్ని పత్రికలు బాగానే అమ్ముతున్నట్టు విన్నానే?" అన్నాడు.

"అవును నాకు తెలుసు. అటువంటి పత్రికలను ప్రస్తుతం బొమ్మలు చదవగలవాళ్లు మాత్రమే కొంటున్నారు. వాటిల్లో వ్యాసాలు కూడా అర్థం కావటం లేదనే ఫిర్యాదున్నది."

కుర్రాడు నిర్ఘాంత పోయినాడు.

"ఈసమస్య ఎట్లా తేలుతుంది?" అన్నాడతను.

"ఆటే చదువూ, ఆలోచనలూ లేని వాళ్ళ రచనలు కొంతవరకు ఈ చిక్కు తొలగించవచ్చు. మామూలు తెలుగువాడికి యాభై అరవై మాటలకు పైన తెలియవని నా సందేహం అంత లోనే రచనలు కూడా ఉంటే ఈనాటి పరితలు పత్రికలు సులువుగా చదువుతారేమో."

"వెనకటి రోజుల్లో పత్రిక లెట్లా నడిచాయంటారు?"

"ఆ రోజుల్లో నడవటం ఒక నడవటమా ఏమిటి? అదీకాక ఆ రోజుల్లో ఇనప గుగ్గిళ్ళ లాంటి గ్రాంధికం చదువుకున్నవారు పత్రికలు చదివేవారు. ఇప్పుడా తరగతి వాళ్ళ దగ్గిర పత్రికలు కొనే డబ్బెక్కడుంది? ఇప్పుడు పత్రికలను ఆదరించే అసంఖ్యాకులకు ఆటే చదువు వచ్చునను కోను."

కుర్రాడికింకో సందేహం తట్టింది.

"అయితే మన పత్రికను సాహిత్య పత్రికగా నడపటానికి లేదన్నమాట?" అన్నాడు అతను.

"ఆమాట కలలోకూడా తలచవొద్దు. ఇవాళ మామూలు సాహిత్య పత్రిక రెండువందల కాపీలు అమ్ముతుంది, మరో కళకు సంబంధించినదైతే ఇంకా తక్కువ అమ్ముతుంది."

"పోనీ వైజ్ఞానిక పత్రిక అయితే?"

"సాంఘిక విజ్ఞానానికి సంబంధించిందైతే నాలుగైదు వందలు అమ్మవచ్చు. అందులో శాస్త్రవిజ్ఞానానికి సంబంధించిన వ్యాసం ఉంటే ఇంకా తక్కువ అమ్ముతుంది. సెక్సు విజ్ఞానానికి సంబంధించిన వ్యాసా లుంటే ఇంకా ఎక్కువ అమ్మవచ్చు."

"సెక్సు విజ్ఞాన మంటే బూతు కథలా?"

"ఎబ్బే! బూతు కథలు ఒక్క చలం తప్ప ఇంకెవరూ రాయరు. ఈ కథలు సెక్సు విజ్ఞానానికి సంబంధించినవి. అంటే కామ ప్రేరణ యొక్క విపరీత ప్రదర్శనాలకు సంబంధించిన కథలు—తండ్రికి కొడుకుకూ, తాతకూ మనుమలకీ, అత్తగారికీ కోడలికీ, మనుష్యుడికీ జంతువులకీ మధ్య ఏర్పడే జాత్యాకర్షణను చుక్కలతో సహా సెక్సు విజ్ఞాన కథలు ప్రదర్శిస్తాయి."

"అటువంటివి రాయటం సులభమే నేమో" అన్నాడు కుర్రాడు ఆలోచిస్తూ.

"నాకు తెలియదు. నేను ప్రయత్నిస్తే నాకు చాతకాలేదు. ఒకసారి ప్రయత్నిస్తే అది అభ్యుదయ రచనలా తయారయి మానెయ్యవలసి వచ్చింది. కాని రాయటం సులభమైతే చదవటమూ సులభమే నని మాత్రం చెప్పగలను."

"అటువంటి సాహిత్యం సంఘానికి పని కొస్తుందంటారా?"

"ఎందుకు పనికి రాకూడదూ? కామోద్రేకాన్ని అటువంటి దారుల్లో పోనియ్యవచ్చునని సామాన్య మానవులకు తెలుస్తుందా? సెక్సు విజ్ఞానం ఊరికే పోదు."

"అయితే మనం ఒక సెక్సు విజ్ఞానపత్రిక పెడితే బాగా అమ్ముతుందంటారా?"

"అమ్మవచ్చు. కాని అటువంటి పత్రికలు బహిరంగంగా పట్టుకు తిరగడానికి కొందరు కాస్త సందేహిస్తున్నట్టు కనిపిస్తుంది."

"చంపేశారు. మన పత్రికకు డబ్బుకంటే కూడా ఖ్యాతి అవసరం. మరీ రెండు వందలమందే కొంటే ఖ్యాతి ఎట్లా వస్తుంది చెప్పండీ? అందుకని సర్క్యులేషను మాట ఆలోచిస్తున్నాను గాని, ఎబ్బే, డబ్బుకోసం కానే కాదు."

"సినిమా పత్రిక పెడితే ఉభయతారకంగా ఉంటుందేమో" అన్నాను.

"సినిమామీద మంచి వ్యాసాలు రాసే వాళ్ళున్నారా?"

"అదే పొరపాటు. రాతఅనేమాట పెట్టుకోవద్దు."

"ఎట్లా మరి?"

"సినిమాతో సంబంధం ఉన్నవాళ్లు రాయరు. రాసేవాళ్ళకు సినిమా సంబంధం లేదు."

"మరి సినిమాపత్రిక నించటం ఎట్లా?"

"బొమ్మలతో."

"తీసే చిత్రాల దృశ్యాలా?"

"అవి అనుకున్నంత సులభంగా అందుతాయనుకోను. అసలు తెలుగులో తీసే చిత్రాలే కొద్ది. అందులో కొందరు స్టిల్స్ తీయరు."

"ఏం?"

"పబ్లిసిటీ ఇష్టంలేకనేమో. నాకు సరిగా తెలియదు."

"మ రెట్లా?"

"పాత పత్రికలో పడిన బొమ్మల బ్లాకులు కొనుక్కోవచ్చు. ఇంగ్లీషు, హిందీ, అరవచిత్రాలకు సంబంధించినవి వేసుకోవచ్చు. పదేళ్ళకిందటి సినిమాతారల ఫోటోలుకూడా వేయవొచ్చు."

"వ్యాసాలు?"

"రాజకీయ వ్యాసాలూ,కథలూ,సాహిత్యవ్యాసాలూ- ఏవైనా వెయ్యొచ్చు సినిమాపత్రికలో."

"అదేం?"

" అంతే. కాగా ఒకటి రెండు వ్యాసాలు వాళ్ళనీ వీళ్ళనీ దుమ్మెత్తి పొయ్యటానికి ఉండాలి.అదిలేకపోతేసినిమాపత్రిక అనిపించుకోదు."

కుర్రాడు ఆముదం తాగిన మొహం పెట్టి, "ఇదంతా చేస్తే సర్క్యులేషన్ వస్తుందా?"

"రాదు."

"త్వరలో చెప్పారు. అయితే మ రేం చేస్తే బాగుంటుం దంటారు? కథలపత్రిక పెడితే?"

"నాకు తెలిసినంతవరకు ప్రజలకు - అంటే ఇవాళ పత్రికలు కొనే ప్రజలకు- అర్థమయే కథలు రాసేవాళ్ళు లేరు."

"పోనీ పిల్లల పత్రిక పెడితే?"

"పెట్టవచ్చు."

"పిల్లల దగ్గిర డబ్బుంటుందా అని."

"పిల్లలకోసం పత్రిక పెడితే అది పెద్దవాళ్లే చదువుతారు - ఆడవాళ్లకోసం పెట్టే పత్రికలు మగవాళ్లు చదివినట్టు."

"పిల్లలపత్రికలు బాగా అమ్ముతున్నాయండీ? ఊరికే గొప్పచెప్పుకోవటమే నా?" "నాకు తెలిసినంతవరకూ నిజంగానే అమ్ముతున్నాయి."

కుర్రాడు ఒకక్షణం ఆలోచించి ఏదో తట్టినట్టుగా చివాలున లేచి, "వస్తానండీ, సెలవు!" అని చెప్పి మారుమాటాడకుండా వెళ్లిపోయినాడు.

ఒకనాడు ఇంటికొచ్చేసరికి నాపేర ఒక కొత్తపత్రిక వచ్చి ఉంది. విప్పి చూద్దును గదా దానిపేరు 'వెర్రివెధవ.' లోపల చాలా బొమ్మలున్నాయి. అందులో కొన్ని త్రివర్ణచిత్రాలు. అట్టమీద కన్ను చెదరిపోయే త్రివర్ణచిత్రం. ఒక బొమ్మలోకూడా బొమ్మకుండ వలసిన కనీస లక్షణాలు లేవు. ఇక వ్యాసాలు చూస్తే ఒక్క వ్యాసానికీ దారీ తెన్నూ లేదు సరికదా ఏవాక్యానికీ వ్యాకరణం లేదు. పసి పిల్లలు కూడా అంత అసహ్యంగా రాయలే రనిపించింది.

ఈ పత్రిక ఆరంభించింది ఆనాడు నాతో మాట్లాడిన కుర్రవా డని నాకు తోచనే లేదు. ఇంతలో అతనే వచ్చాడు.

'ఏమండీ పత్రిక అందిందా? ఓహో, అదే చూస్తున్నారా? ఎట్లా ఉంది?' అన్నాడు.

నేను విచార సూచకమైన గొంతుతో, 'ఈ పత్రిక అమ్ముతుం దనుకోను' అన్నాను.

'అదేమండీ? బాగానే అమ్ముతోందే?ఇక్కడి ఏజెంటుకు పొద్దున అయిదు వందల కాపీలిచ్చాను. మళ్ళీ ఈ పూట వెయ్యి ఇమ్మంటూ కూచున్నాడు' అన్నాడు.

"ఎన్ని కాపీలు వేశా రేమిటి?" అన్నాను.

"భయపడి అయిదువేలే వేశాను. ఈసారి పదివేలన్నా వేస్తేగాని మాటదక్కదు"అన్నాడు.

కోస్తున్నా డనుకున్నాను.

"ఫరవాలేదు. ఫరవాలేదు. వ్యాసానికి యాభైరూపాయల చొప్పున ఇవ్వగలను. ఈ సారి సంచికలో ఆ విషయం ప్రకటిస్తాను. నా పత్రిక ఏపత్రికా చెయ్యలేనిపని చేస్తుంది చూస్తూ ఉండండి. ఇంకేమీ లేకపోయినా, రాసేవాడికింత భుక్తి చూపగలను" అన్నాడు.

నాలుగునెలలు తిరిగే లోపుగా 'వెర్రివెధవ' యాభైవేల కాపీలు అమ్మింది. వ్యాసానికి నూరు రూపాయ లిస్తామని సంపాదకుడు ప్రకటించాడు.

నాకు ఆశ పుట్టింది. నేనే నిజంగా రాయగలవాణ్ణయితే ఒక పిచ్చి వ్యాసం ఎందుకు రాయకపోవాలి? రాశాను. నాకు చాతనైనంత దౌర్భాగ్యపు చెత్త రాశాను. మాఆవిడ అదిచూసి, "ఇదే పత్రికలో పడాలి, నీకూ నాకూ చెల్లూ!" అన్నది. ముందు నూరు రూపాయలూ చేతికొస్తే ఆ తరవాత ఒక జార్జెటు చీర కొని అయినా దాని కోపం తీర్చలేక పోతానా అనుకున్నాను.

మూడోనాటికి నా వ్యాసం నాకు తిరిగి వచ్చింది. "ఇంత భావగాంభీర్యం గల వ్యాసాన్ని మా పఠితలు ఆనందించలేరు. ఇంకా తేలికైన వ్యాసం ఒకటి పంపరూ?" అంటూ సంపాదకుడు నన్ను పరామర్శించాడు.